

మూసాపేట మండలం తుంకినీపూర్ నుంచి వేముల పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

## బస్సుల్లేవు.. బడికి పోయేదెట్లా..

మూసాపేట, జూలై 3 : మూసాపేట మండలంలోని తుంకినీపూర్ గ్రామం జాతీయ రహదారి నుంచి 3 కిలోమీటర్లు, వేముల గ్రామం కూడా 2 కి.మీ. ఉంటుంది. గ్రామంలో కేవలం ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉన్నది. పైచదువులు చదవాలంటే ఇటు మూసాపేట, అటు వేముల గ్రామానికైనా వెళ్లాల్సింది. కానీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజూ విద్యార్థులు ఉదయం, సాయంత్రం కాలినడకన వచ్చి వెళ్తుంటారు. అంతదూరం వెళ్లి రావాలంటే ఇబ్బందులు తలెత్తుతుండడంతో పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్లలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఎలాగైనా తమ గ్రామం మీదుగా వేములకు బస్సు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. అదేవిధంగా నందిపేట, దాసరిపల్లి, చక్రాపూర్, అచ్చాయిపల్లి, తాళ్లగడ్డ, తిమ్మాపూర్, పోల్కంపల్లి, నిజాలాపూర్, మహ్మద్‌హుస్సేన్‌పల్లి తదితర గ్రామాల విద్యార్థుల పరిస్థితి కూడా అంతే. విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు వివిధ అవసరాల కోసం ప్రయాణం చేయాల్సి వస్తే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. వాటితో ఎన్నో ప్రమాదాలు జరిగి వికలత్వం రావడంతోపాటు, ఆర్థికంగా కూడా నష్టపోతున్నారు. అందుకని ప్రభుత్వం ప్రతి గ్రామానికి బస్సు నడిపేలా సంబంధిత అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉన్నది.



దేవరకద్ర మండలం గద్దెగూడెం నుంచి పాఠశాలకు ప్రమాదకరంగా ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

### బస్సు సౌకర్యం కల్పించాలి



కాలేజీకి పోవాలంటే మా గ్రామానికి ఆర్టీసీ బస్సు రాక నిత్యం అవస్థలు పడుతున్నాం. డాకుతండా నుంచి లట్టుపల్లి వరకు రోజూ నడిచి వస్తున్నాం. లట్టుపల్లి గ్రామానికి కూడా ఆర్టీసీ బస్సులు రావడం లేదు. కళాశాలకు వెళ్లాలంటే ఆటోలు, ఇతరుల బైక్‌లపై లిఫ్ట్ అడిగి వెళ్లాల్సి వస్తుంది. ఎన్నిసార్లు డిపో మేనేజర్‌కు విన్నవించుకున్నా బస్సులు నడిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లట్టుపల్లితోపాటు గ్రామ పరిధిలోని 18 తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలి.

*- సాయికుమార్, డిగ్రీ విద్యార్థి, డాకుతండా, బిజినేపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*

### ఇబ్బందులు పడుతున్నాం..



మాది తెలకపల్లి మండలం వల్లభాపూర్ గ్రామం. మా గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ఉన్నత చదువుల కోసం తెలకపల్లి, నాగర్‌కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్నది. ఆర్థికంగా ఉన్న వారు ఆటోల్లో ప్రయాణిస్తుంటే ఆర్థిక స్థోమతలేని మాలాంటి విద్యార్థులు కాలినడకన తెలకపల్లికి చేరుకుంటున్నారు. వల్లభాపూర్ నుంచి రాంపూర్ స్టేజీ వరకు నిత్యం నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ఏదైనా బస్సులో తెలకపల్లికి చేరుకుంటున్నాం. నాతోపాటు చాలా మంది విద్యార్థులు బస్సు కోసం అవస్థలు పడుతున్నారు. సమయానికి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలనే ఉద్దేశంతో ఆటోల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం రెండు కిలో మీటర్ల పైబడి నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సులు నడిపించాలి.

*- అరవింద్, డిగ్రీ విద్యార్థి, వల్లభాపూర్, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా*



**నిలబడేందుకూ జాగలేదు..**

నాగర్‌కర్నూల్ జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాను. నాది కుమ్మెర గ్రామం. బడికి వచ్చే బస్సు నిండిపోయి ఉంటుంది. రోజూ ఒకటే బస్సు వస్తుంది. నిలబడేందుకు కూడా చోటు ఉండడం లేదు. బడికి లేటవుతుంది. ఇంటికి వెళ్లేటప్పుడు ఈ బస్సు పోతే మరో బస్సు లేకున్నా.. నిలబడే వెళ్తున్నాం. *- శశికళ, విద్యార్థిని, కుమ్మెర*



**నిత్యం ఆటోలోనే..**

నాగర్‌కర్నూల్‌లోని హైస్కూల్‌లో చదువుకుంటున్నా. మా ఊరికి ఒకే బస్సు వస్తుంది. సాయంత్రం స్కూల్ విడిచే వరకు బస్సు వెళ్లిపోతుంది. అందుకే రోజు నాగర్‌కర్నూల్ నుంచి ఆటోలో ఊరికి వెళ్తాను. సాయంత్రం వేళల్లో కూడా బస్సు ఉంటే బాగుంటుంది.

*- హారిక, విద్యార్థిని, సల్కర్‌పేట*



**సాయంత్రం బస్సు ఉండదు..**

మాది చర్లతిరుమలాపూర్, నాగర్‌కర్నూల్‌లో చదువుకుంటాను. సాయంత్రం బడి నుంచి వచ్చే టైంకు బస్సు ఉండదు. బస్సు పాసులు కూడా ఇంకా ఇయ్యలేదు. అందుకే ఆటోలు, బస్సుల్లో చార్జీలు ఇచ్చి వెళ్తున్నాం.

*- సాజిద్, విద్యార్థి, చర్లతిరుమలాపూర్*

# కాలినడకే దిక్కు!

## బడికి వెళ్లేందుకు పాదాలకు పనిచెబుతున్న విద్యార్థులు

- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- 'మహాలక్ష్మి' ఉన్నా బాలికలకు నిరుపయోగం
- ఇంకా ప్రారంభం కాని బస్‌పాసులు
- చదువు కోసం చిన్నారుల పాట్లు





నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడిన విద్యార్థులు

నాగర్‌కర్నూల్, జూలై 3 (నమస్తే తెలంగాణ) : చదువుకునేందుకు విద్యార్థులు నానా పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తున్నామని చెబుతున్నా రవాణా సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నది. దీనికి నిదర్శనం ఆటోలు, ట్రాక్టర్ల లాంటి వాహనాలను ఆశ్రయిస్తున్న విద్యార్థులే ప్రత్యేక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తామని ఓ వైపు ప్రకటనలు చేస్తున్నా విద్యాశాఖ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నా ఆశించిన స్థాయిలో చర్యలు కన్పించడం లేదు. విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఉన్నత విద్య కోసం మండల కేంద్రాలు, పట్టణాలకు వెళ్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులు ప్రాథమిక విద్య పట్టణాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు రవాణా సదుపాయం లేక నానా అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికే చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. ఆర్టీసీ సంస్థ రూట్ల ప్రకారంగా బస్సులు నడిపిస్తుంది. దీని వల్ల ఆయా రూట్ల మీదుగా ఉండే ముఖ్య పట్టణాల మార్గాల్లో ఉండే గ్రామాలకు మాత్రమే అధికంగా బస్సులు వెళ్తున్నాయి. ఆయా రూట్ల నుంచి లోపలికి ఉండే గ్రామాలకు బస్సులే వెళ్లడం లేదు. ఆర్టీసీ సంస్థ అన్ని రూట్ల ప్రకారం బస్సులు నడిపిస్తున్నామని చెబుతున్నా మండలాల వారీగా 70 నుంచి 80శాతం గ్రామాలకు బస్సులు నడిపించడం లేదు. నియోజకవర్గ కేంద్రం, మండలాలను మినహాయిస్తే మిగిలిన మండలాల్లో ఇవే పరిస్థితులు ఉన్నాయి. పాఠశాల సమయాల్లో బస్సులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పాఠశాలకు సమయానికి చేరుకోవడంతోపాటుగా సాయంత్ర వేళల్లో ఇంటికి వెళ్లేందుకు ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయిస్తున్నారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఎక్కుతుండడంతో విద్యార్థుల కోసం వేసిన బస్సులు సైతం రద్దీగా మారుతున్నాయి. దీంతో్ల బస్సులో ఎక్కిన విద్యార్థులు నిలబడి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ముఖ్యంగా బాలికలు మహాలక్ష్మి పథకానికి దూరమవుతున్నారు. ప్రత్యామ్నాయంగా ఆటోలకు చార్జీలు చెల్లిస్తున్నారు. ఇంకా ఆర్టీసీ సంస్థ బస్సు పాసులను కూడా ప్రారంభించలేదు. ఈ కారణంగా విద్యార్థులు చార్జీలు చెల్లించి పాఠశాలలకు చేరుకుంటున్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు త్వరగానే రావడంతోపాటు సాయంత్రం ఆలస్యంగా వెళ్లడం వల్ల ఆయా సమయాల్లో బస్సులు లేక ఆటోల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొందరు తల్లిదండ్రులు సమీప పట్టణాలకు తీసుకొచ్చి తీసుకెళ్తున్నారు. బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్టాండ్‌లో సాయంత్రం పాఠశాలలు విడిచినప్పుడు పెద్దసంఖ్యలో బస్సు ఎక్కేందుకు విద్యార్థులు పరుగులు పెడుతున్నారు. ప్రమాదకరంగా ఉన్నా తప్పనిసరిగా విద్యార్థులు బస్సుల వెంట పరుగులు పెడుతున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలోని అమ్రాబాద్, పెంట్లవెల్లి, కోడేరు, లింగాల, పదర తదితర మండలాల్లోని చాలా గ్రామాల్లో బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలోనే అమ్రాబాద్, పదర మండలాల్లోని గ్రామాల్లోకి బస్సులు వెళ్లడం లేదు. జొన్నంరెడ్డిపల్లి, తుర్కపల్లి, వెంకటేశ్వర్లబావి, గంగనోనిపల్లి, లక్ష్మాపూర్, ఎన్నంపల్లి, కొత్తపల్లి, కలుములోనిపల్లి, ఎలమపల్లి, లింగాల మండలం వంకితండా, జేసీతండా, జీలుగుపల్లి, కొత్తగుట్టపల్లి, వడ్డె రాయవరం, కొల్లాపూర్ మండలంలోని ఎర్రగట్టు బొల్లారం, ఎల్లూరు చెంచుగూడెం, పెంట్లవెల్లి మండలంలోని తడకలవారికొండ, మంచాలకట్ట, బల్మూరు మండలం కుల్లంపల్లి, కోనేటిపూర్, తుమ్మలపల్లి, రంగాపూర్‌కొండ, తాడూరు మండలం పొల్మూరు, గుట్టలపల్లి, అల్లాపూర్, చర్లఇటిక్యాల, లచ్చిరాంతండా, తెలకపల్లి మండలం పర్వతాపురం, దాసుపల్లితో పాటు తదితర గ్రామాలకు బస్సులు వెళ్లడం లేదు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కోసం అదనంగా పాఠశాల సమయాల్లోనే బస్సులు నడపాల్సిన అవసరం ఉన్నది.



వంగురోనిపల్లి, లక్ష్మాపూర్ నుంచి అమ్రాబాద్ మండలకేంద్రంలోని బడికి ట్రాక్టర్‌లో వచ్చిన విద్యార్థులు

## విద్యార్థుల అవస్థలు

- రెండ్రోజులుగా ఉపాధ్యాయుల గైర్హాజరు
- మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు చేయని వంట ఏజెన్సీలు



గుడ్లు లేకుండా భోజనం వడ్డిస్తున్న వంట కార్మికులు

మాగనూరు, జూలై 3 : మండలంలోని మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు రెండు రోజులుగా ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు వచ్చి కూర్చొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు పాఠశాల నడుస్తున్నది. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా తిమ్మన్న అనే ఉపాధ్యాయుడు హెచ్‌ఎంగా ప్రమోషన్ రావడంతో కొల్పూర్‌కు వెళ్లారు. మిగతా ఇద్దరు ఉండగా ఒకరు వాళ్ల బంధువు చనిపోవడంతో లీవ్‌పై వెళ్లాడు. ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు సైతం రెండు రోజులుగా పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు వచ్చి కూర్చొని ఆడుకొని పోవడం తప్పా ఏం చేయడం లేదు. అయితే ఉపాధ్యాయులు లేకపోవడంతో వంట ఏజెన్సీ వారు ఇష్టారీతిగా వ్యవహరిస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా సక్రమంగా పెట్టడం లేదు. మెనూ ప్రకారంగా బుధవారం విద్యార్థులకు గుడ్లు పెట్టాల్సి ఉండగా కేవలం బిస్కెట్లు ఇచ్చి సరిపెట్టారు. రెండు రోజులుగా ఉపాధ్యాయులు హాజరుకాని విషయంతోపాటు మధ్యాహ్న భోజనం గురించి గ్రామస్తులు జిల్లా విద్యాధికారికి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా ఆయన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంతో మాట్లాడుతానని చెప్పి ఫోన్ పెట్టేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా పాఠశాలకు వచ్చేలా చూడాలని, దీంతోపాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్లేట్లు కడగడానికి కూడా నీరు లేని వైనం



బడి బయట సీకుల మధ్య కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

## విద్యార్థులున్నారు.. టీచర్ లేరు

పెబ్బేరు, జూలై 3 : పెబ్బేరు మండలం కొత్తసూగూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లేకుండానే కొనసాగుతున్నది. స్థానిక దళితవాడలోని ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులుండగా, ఒక్క టీచరే విధులు నిర్వర్తించేవారు. ఆమె కూడా బదిలీ కావడంతో రెండు రోజులుగా విద్యార్థులే పాఠశాలకు వచ్చిపోతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఎంఈవో జయరాములును వివరణ కోరగా బదిలీ అయిన టీచరు స్థానంలో నియమితులైన కొత్త టీచరు గురువారం నుంచి విధులకు హాజరవుతారని తెలిపారు. అయితే తమ పాఠశాలకు ఇద్దరు టీచర్లను కేటాయించాలని మాజీ సర్పంచ్ వెంకటేశ్ కోరారు.



పాఠశాలలో టీచర్లు లేక ఆరుబయట ఆడుకుంటున్న విద్యార్థులు



నాగర్‌కర్నూల్ నుంచి సొంతూరికి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు

## మళ్లీ అధికారంలోకి వస్తాం..

- కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



స్థానిక సంస్థల సభ్యులను సన్మానిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 3 : రాష్ట్ర సాధనకు ఎన్నో పోరాటాలు చేసి జైలు జీవితం గడిపి తెలంగాణను సాధించుకున్నామని.. కేసీఆర్ నాయకత్వంలో మళ్లీ అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని, బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అన్నింటా అభివృద్ధి సాధించిందని చెప్పుకొచ్చారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యుల సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలను పూలమాలలు, శాలువాలు, మెమెంటోలు అందజేసి సన్మానించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌కుమార్‌రెడ్డిని మాజీ మంత్రితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రె స్ పార్టీ అబద్ధపు హామీలను చెప్పి అధికారంలోకి వచ్చిందని, ప్రజలు కూడా జరిగిన పొరపాటును ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు అమలుకు సాధ్యం కాదని తెలిసినా అధికారం కోసం తప్పుడు ప్రచారం చేశారన్నారు. పెంచిన పింఛన్లు, మహిళలకు రూ.2500 భృతి, రైతులకు రుణమాఫీ, ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వకుండా ప్రజాపాలన అంటూ చెప్పుకోవడమే తప్పా చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజలు కరెంట్, సాగు, తాగు నీటి కోసం ఇబ్బందులు పడలేదని, ఇప్పుడు పంటలు వేసుకున్న రైతులకు కరెంట్ సరఫరా లేక సాగు నీరు లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కొద్ది మంది పార్టీ మారాలని చూస్తున్నారని, పార్టీని వదిలి పెట్టడం అంటే కన్నతల్లిని వదిలేసినట్లేనని పేర్కొన్నారు. అగ్ని పరీక్షలో నిలబడిన వారే అసలైన నాయకులు, కార్యకర్త అని చెప్పారు. మనం చేసిన పొరపాట్లను సరి చేసుకొని ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు కష్టపడి పనిచేశారన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాలమూరును హైదరాబాద్ తరహాలో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు నమ్మకంతో కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, వైస్‌చైర్మన్ గణేశ్, డీసీసీ వైస్ చైర్మన్ వెంకటయ్య, జెడ్పీటీసీ వెంకటేశ్వరమ్మ, ఎంపీపీలు బాలరాజు, సుధాశ్రీ, నాయకులు శివరాజ్, కరుణకర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, రాఘవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సాయిలు పాల్గొన్నారు.

## పరదా రాజకీయాలు మానండి..

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాలనపై దృష్టి సారించాలి
- ఎంజేఆర్ ట్రస్ట్ నిర్మించిన పాఠశాలలపై పేర్లు తూడ్చడం నీచమైన చర్య
- విలేకరులతో మాజీ ఎమ్మెల్యే మర్రి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/తాడూరు, జూలై 3 : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పరదా రాజకీయాలు మాని పాలనపై దృష్టి సారించాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం సిర్సవాడ, తాడూరు గ్రామాల్లో ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మర్రి రిటైల్ కంపెనీతో నిర్మించిన పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మా ఎమ్మెల్యే మర్రి విలేకరులతో మాట్లాడుతూ తాము నిర్మించిన పాఠశాలలకు ట్రస్ట్ పేర్లను తూడ్చివేయడం, పేర్లకు పరదాకప్పి పాఠశాలలు, వంట గదులను ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుమేరకు మన ఊరు-మనబడిలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో సిర్సవాడ, తాడూరు గ్రామాల్లో పాఠశాలలను సుందరంగా నిర్మించామన్నారు. సిర్సవాడ పాఠశాలను తాను గతంలోనే ప్రారంభించినప్పటికీ.. ట్రస్ట్ పేరుకు పరదా కట్టి మళ్లీ ప్రస్తుత ఎమ్మెల్యే ప్రారంభించి నీచరాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. ట్రస్ట్ బోర్డుపై పేర్లను తూడ్చగలిగారు కానీ.. ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల మనస్సులో మర్రి జనార్దన్‌రెడ్డిని తొలగించలేరన్నారు. రూ. 60 లక్షల ప్రభుత్వ నిధులతో కేవలం వంటగదులు, ప్రహరీ నిర్మించామని.., కానీ పాఠశాల మొత్తం వాటితోనే కట్టామని ఆరోపించడం సరికాదన్నారు. ప్రభుత్వ నిధులతోనే పాఠశాల నిర్మించినట్లు రుజువు చేస్తే.. తాను ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. 'తూడుకుర్తి, తాడూరు దవాఖాన, కళాశాలకు భూమి ఇచ్చి ప్రభుత్వ నిధులతో కట్టించిన వాటికే మీ పేర్లు పెట్టుకున్నారు.. మీలాగే నేను అలా చేయాలంటే ఆ పేర్లను తూడ్చివేసేవాడిని' అని అన్నారు. 'నేను చేసినంత అభివృద్ధిని మీరు చేస్తే మా కార్యకర్తలతో వచ్చి సన్మానం చేస్తా' అని సవాల్ విసిరారు. మీవల్ల ఏదీ కాదని, ఏడు నెలలకే ఏమీ చేయలేరనే విషయం ప్రజలకు అర్థమైందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు క్యాంప్ కార్యాలయానికి ఏదో ఒక పనికోసం వెయ్యి మంది వచ్చేవారని, మీ వద్దకు పదిమంది కూడా వస్తలేరంటే ఏం జరుగుతున్నదో అర్థం కావాలన్నారు.

***అధికారులపై మండిపాటు..***

ప్రభుత్వ అధికారులు సైతం ప్రభుత్వానికి వంత పాడుతున్నారని, న్యాయం వైపు ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు పదవులు, అధికారులకు పోస్టులు శాశ్వతం కాదని, ఎక్కడ చేశామన్నది కాదని, ఎన్ని మంచి పనులు చేశామన్నదే గుర్తింపు ఉంటుందన్నారు. పాఠశాల ప్రారంభించే విషయంలో జిల్లా అధికారులతో మాట్లాడితే కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని మండిపడ్డారు. పోలీసులు సైతం ప్రభుత్వానికి మద్దతు పలుకుతున్నారన్నారు.

***పురుడుపోసుకున్న ఇసుకమాఫియా..***

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో నాగర్‌కర్నూల్ ప్రాంతంలో ఇసుకమాఫియా పురుడుపోసుకున్నదని మాజీ ఎమ్మెల్యే మర్రి ఆరోపించారు. నాడు ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకొని ట్రాక్టర్ల ద్వారా తరలించేవారని.., నేడు టిప్పర్లతో తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారన్నారు. మా కార్యకర్తలను వేధిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ జిల్లా మాజీ చైర్మన్ హన్మంత్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబురావు, నాయకులు రమేశ్‌రెడ్డి, వేణుకుమార్, సమద్ పాషా, రమణ, తిరుపతిరెడ్డి, అనిల్‌రెడ్డి, నాగయ్య, శేఖర్ గౌడ్, పర్వతాలు, మశన్న, కృష్ణయ్య, బాలవెంకటయ్య, శేఖర్‌గౌడ్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.